క్లుప్తంగా

మార్చి 8న లోక్‌అదాలత్



పోలీసులకు సూచనలిస్తున్న జడ్జి రాఘవేంద్ర

పుత్తూరు: స్థానిక సబ్ కోర్టు ఆవరణలో మార్చి 8వ తేదీన జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్టు సీనియర్ సివిల్ జడ్జి, న్యాయ సేవాధికార సంస్థ అధ్యక్షులు ఎస్.సి.రాఘవేంద్ర తెలిపారు. ఆయన శనివారం కోర్టులో పోలీసులతో లోక్ అదాలత్‌పై సమావేశం నిర్వహించారు. జడ్జి మాట్లాడుతూ అన్ని రకాల సివిల్ కేసులు, వివాహ సంబంధ మనోవర్తి, చెక్కు బౌన్స్ కేసులు, రాజీ చేసుకోదగ్గ క్రిమినల్ కేసులను ఈ లోక్ అదాలత్‌లో పరిష్కరించుకోవచ్చునని తెలిపారు. అలాగే ప్రీ లిటిగేషన్ కేసులు (కోర్టులో పెండింగ్‌లో లేని కేసులు) సైతం రాజీ చేయడం జరుగుతుందని వెల్లడించారు. లోక్ అదాలత్‌లో తీర్పు అంతిమ తీర్పు అని, దీనిపై అపీలు వెళ్లడానికి అవకాశమే లేదని స్పష్టం చేశారు. పోలీసులు ఎక్కువ కేసులు పరిష్కారం అయ్యేలా చొరవ చూపాలన్నారు. సమావేశంలో ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి జానకి, జూనియర్ సివిల్ జడ్జి గోపాలకృష్ణ, బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ పురుషోత్తం, పుత్తూరు, కార్వేటినగరం, పుత్తూరు రూరల్ సీఐలు సురేంద్రనాయుడు, హనుమంతప్ప, రవీంద్ర, ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

మండల మీట్ రేపు

శ్రీరంగరాజపురం : మండలకేంద్రలోని ఎంపీడీఓ కార్యాలయంలో సోమవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ మోహన్‌మురళి తెలిపారు. శనివారం ఆయన తన కార్యాలయంలో స్థానిక విలేకరులతో మాట్లాడుతూ సోమవారం మధ్యాహ్నం 2 గంటలకు ఎంపీపీ సరిత అధ్యక్షతన సమావేశం ప్రారంభమవుతుందని చెప్పారు. జెడ్పీటీసీ, ఎంపీటీసీలు, సర్పంచులు, మండల కోఆప్షన్ మెంబర్, వివిధ శాఖల అధికారులు సమావేశంలో పాల్గొనాలని కోరారు.

అయ్యప్ప ఆలయంలో ఉత్తరానక్షత్ర పూజలు



భక్తులకు అన్నదానం

నగరి : పట్టణంలోని బైపాస్ కూడలి సమీపంలో ఉన్న శ్రీ ధర్మశాస్తా అయ్యప్ప స్వామి ఆలయంలో శనివారం అయ్యప్ప స్వామి జన్మనక్షత్రమైన ఉత్తరా నక్షత్ర పూజలు వైభవంగా నిర్వహించారు. భక్తులకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమానికి కస్తూరి చంద్రశేఖర్, అరుణ మునస్వామి ఉభయదారులుగా వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో భక్తులు కన్నప్ప, మునస్వామి, ఎల్లప్పరెడ్డి, రమేష్ బాబు, సురేష్, దుర్గాప్రకాష్ స్వామి తదితరులు పాల్గొన్నారు.

సారా బట్టీలపై దాడులు



బెల్లం ఊటను ధ్వంసం చేస్తున్న పోలీసులు

పాలసముద్రం : మండలంలోని నరసింహపురంలో శనివారం సారా బట్టీలపై ఎస్ఐ చిన్నరెడ్డప్ప తమ సిబ్బందితో కలసి దాడులు చేశామన్నారు. నరసింహపురం పంచాయతీ సమీపంలో ఓటేరు కాలువలో సారా తయారీకి ఉంచిన బెల్లం ఊటను 400 లీటర్లు ధ్వంసం చేశామన్నారు. సారా తయారు చేస్తూ పట్టుబడిన పెరుమాల్ (పటాస్‌పెరుమాల్) అనే వ్యక్తి వద్ద నుంచి 5 లీటర్ల సారా స్వాధీనం చేసుకుని, అతనిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

ఘనంగా కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం



ఆలయంలో శుద్ధి చేస్తున్న ఆలయ అధికారులు

తిరుపతి కల్చరల్: కపిలేశ్వరస్వామి ఆలయలో శనివారం కోయిల్ ఆళ్వార్ తిరుమంజనాన్ని ఘనంగా నిర్వహించారు. బ్రహ్మోత్సవాలకు ముందు కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం నిర్వహించడం ఆనవాయితీ. ఇందులో భాగంగా ఉదయం సుప్రభాతంతో స్వామివారిని మేల్కొలిపి అభిషేకాలు చేశారు. అనంతరం గర్భాలయం, ధ్వజస్తంభం, ఉప ఆలయాలు, ఆలయ పరిసరాలను శుద్ధి చేశారు. సుగంధ ద్రవ్యాలతో ప్రోక్షణ చేశారు. డెప్యూటీ ఈవో దేవేంద్రబాబు పాల్గొన్నారు.

తిరుచ్చిపై కల్యాణ వెంకన్న విహారం

చంద్రగిరి: శ్రీనివాసమంగాపురంలో వెలసిన కల్యాణ వేంకటేశ్వర స్వామి శనివారం సాయంత్రం బంగారు తిరుచ్చిపై ఊరేగుతూ భక్తులను అనుగ్రహించారు. వారపు ఉత్సవాల్లో భాగంగా శనివారం తెల్లవారుజామున స్వామిని సుప్రభాతంతో మేల్కొలిపి నిత్య కైంకర్యాలు చేశారు. అనంతరం స్వామిని విశేషంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. సాయంత్రం ఊంజల్ సేవను చేపట్టారు. అనంతరం సర్వాలంకార శోభితుడైన శ్రీనివాసుడు తన దేవేరులతో కలిసి తిరుచ్చిపై ఆశీనులై నాలుగు మాడవీధుల్లో ఊరేగారు.

వరి పంటలో తగిన సస్య రక్షణ చర్యలు తీసుకుంటే అధిక దిగుబడి సాధించవచ్చు. ముఖ్యంగా సూక్ష్మ పోషకాల లోపాలను గుర్తించడం, చీడపీడల నివారణకు చర్యలు తీసుకోవాలి. అలాగే ఎప్పటికప్పుడు పంట ఎదుగుదలను పరిశీలిస్తూ అధికారుల సలహాలు, సూచనలు పాటిస్తే నష్టాల నుంచి గట్టెక్కవచ్చు.

- లోపాలు గుర్తించి నివారణ చర్యలు తీసుకోవాలి
- చీడపీడలపై అప్రమత్తంగా ఉండాలి



వరి పంట

సూక్ష్మపోషకాలతో అధిక దిగుబడి

విజయపురం : మండలంలోని రైతులు ఎక్కువ మంది ఈ రబీ సీజన్‌లో బోరుబావులు, చెరువుల కింద వరి పంటను సాగు చేస్తున్నారు. సరైన యాజమాన్య పద్ధతులు పాటించక తీవ్రంగా నష్టపోతున్నారు. పంటసాగు ఒక ఎత్తయితే ఆ పంటకు కావలసిన ఎరువులు అందించే విధానం చాలా ముఖ్యం. పంట ఎదుగుదలకు ప్రధాన పోషకాలతోపాటు సూక్ష్మ పోషకాలు చాలా అవసరం. ముఖ్యంగా నత్రజని, భాస్వరం, పొటాష్ అందుబాటులో ఉన్నా, సూక్ష్మపోషకాలైన జింకు, ఇనుము, బోరాన్, రాగి, క్లోరిన్ లోపాలు ఉంటే దిగుబడులు తగ్గుతాయని వడమాలపేట ఏవో విజయ్‌కుమార్ చెబుతున్నారు. నేలలో ఏ ఒక్క పోషక పదార్థ లోపించినా ప్రధాన పోషకాలు సరిగా పని చేయవని, దిగుబడి రాదని పేర్కొంటున్నారు.

పైరు ఎదుగుదలకు జింక్ ఎంతో అవసరం

పైరు ఎదుగుదలకు అవసరమైన హార్మోన్లు, అమైనో ఆమ్లాలు, మాంసపుకృత్తులు తయారు చేసుకోవడానికి నత్రజని, భాస్వరం వంటి పోషకాల సమర్థ వినియోగానికి జింక్ చాలా అవసరం ఉంటుంది. దీని లోపం కారణంగా వరిలో మొక్క పైనుంచి 3 లేదా 4 ఆకుల మధ్య ఈనె పాలిపోతుంది. నాటిన 2 నుంచి 4 వారాల్లో ముదురాకు చివరల్లో మధ్య ఈనెకు ఇరుపక్కల తుప్పు లేదా ఇటుక రంగు మచ్చలు కనిపిస్తాయి. ఆకులు గిడసబారి దుబ్బులు (గంటలుగా) తయారుకావు. మురుగునీరు పోని భూముల్లో ఇది ఎక్కువగా కనిపిస్తుంది. వరిలో ఎక్కువ మోతాదులో నత్రజని, భాస్వరం, ఎరువుల వాడకం వలన జింక్ లోపం వస్తుంది.

పత్రహరితం తయారీకి ఇనుము దోహదం

ఆకులో పత్ర హరితం తయారు కావడానికి ఇనుము ఎంతో అవసరం ఉంటుంది. ఇది పిండి పదార్థాల తయారీకి ఉపయోగ పడుతుంది. మెట్ట ప్రాంతాల్లోని వరి నారుమళ్లలో ఇనుము లోపం కనిపిస్తుంది. ఇనుప ధాతు లోపం కారణంగా లేత చిగురాకులు తెల్లగా మారుతాయి. లోపం ఎక్కువగా ఉన్నప్పుడు ఇటుక రంగు మచ్చలు ఏర్పడి ఆకులు ఎండిపోతాయి. దీని నివారణకు ఒకలీటరు నీటికి 20 గ్రాముల అన్నభేది, 2 గ్రాముల నిమ్మ ఉప్పు కలిపి పిచికారీ చేసుకోవాలి. ఈ ద్రావణాన్ని 5 రోజుల వ్యవధిలో 2 నుంచి 3 సార్లు పిచికారీ చేయాలి. మార్కెట్లో అన్ని సూక్ష్మ పోషకాల మిశ్రమం ఆగ్రో మిన్మాక్స్ రూపంలో ఫార్ములా-4 రూపంలోనూ దొరుకుతాయి.

నివారణ చర్యలు

ఒకేసారి వరి పండించే భూముల్లో అందునా రెండు పంటలు పండించే వారు ప్రతి సీజన్లోనూ ఆఖరి దమ్ములో ఎకరాకు 20 కిలోల జింక్ సల్ఫేటు వేయాలి. జింకు లోపం సవరించడానికి ఎకరాకు 400 గ్రాముల జింక్ సల్ఫేటును 200 లీటర్ల నీటిలో కలిపి వారం రోజుల వ్యవధిలో రెండు సార్లు పిచికారీ చేయాలి. భాస్వరం ఎరువులతో జింక్ సల్ఫేట్‌ను కలిపి వేయవద్దు. ఎరువు వేసేటప్పుడు కనీసం 3 రోజుల వ్యవధి ఉండాలి. జింక్ సల్ఫేట్ వేయలేని పరిస్థితుల్లో పైరుపై జింక్ లోపం కనిపించగానే లీటరు నీటికి 2 గ్రాముల జింక్ సల్ఫేట్‌ను కలిపి 5 రోజుల వ్యవధిలో 2 నుంచి 3 సార్లు పిచికారీ చేయాలి.

ఆక్రమిత భూమి స్వాధీనం



ఆక్రమణదారులతో చర్చిస్తున్న తహసీల్దార్, సీఐ

నగరి : మండలంలోని గుండ్రాజుకుప్పం గ్రామంలోని సర్వే నంబరు 97/1,97/4,97/3లోని ఆక్రమణకు గురైన 3.41 ఎకరాల ప్రభుత్వ భూమిని తహసీల్దార్ రవికుమార్ శనివారం స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ ప్రభుత్వ అనాధీన భూమిని బాల ప్రసాద్ అనే వ్యక్తి ఆక్రమించుకుని 20 ఏళ్ల నుంచి క్రషర్ నడుపుతున్నాడని తెలిపారు. ప్రస్తుతం సర్వేలో దీన్ని గుర్తించినట్టు తెలిపారు. సంబంధిత వ్యక్తికి ఎలాంటి రికార్డులు లేవన్నారు. దీంతో నోటీసులు జారీ చేశామని, అతను కలెక్టర్ కోర్టుకు అప్పీలు చేసుకున్నాడని తెలిపారు. పరిశీలించిన జిల్లా కలెక్టర్ సంబంధిత భూమి అనాధీన భూమిగా తేల్చారని, దీంతో భూమిని సీఐ మహేశ్వర్, పోలీసులు, రెవెన్యూ సిబ్బందితో కలిసి స్వాధీనం చేసుకున్నట్టు చెప్పారు. ఆ భూమి విలువ సుమారు రూ.3 కోట్లు ఉంటుందన్నారు.

మునెమ్మకు నివాళి



మునెమ్మ మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న కృపాలక్ష్మి



నివాళులర్పిస్తున్న విజయానంద రెడ్డి, ఇన్‌సెట్‌లో మునెమ్మ (ఫైల్)

గంగాధర నెల్లూరు: మండలంలోని వేల్కూరు పంచాయతీ మాజీ సర్పంచ్ మునెమ్మ(70) శనివారం గుండెపోటుతో మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న గంగాధర నెల్లూరు, చిత్తూరు నియోజకవర్గాల వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జ్‌లు కృపాలక్ష్మి, విజయానంద రెడ్డి గ్రామానికి చేరుకుని మునెమ్మ మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మునెమ్మ కొడుకు, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు కుట్టిని ఓదార్చారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు వేల్కూరు బాబు రెడ్డి, వైస్ ఎంపీపీ హరిబాబు, వెంకటరెడ్డి, కేశవరెడ్డి, శేఖర్, ఢిల్లీ, జగదీష్ బాబు, నాయకులు, కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

రోడ్డు మరమ్మతుకు చర్యలు



రోడ్డు పనులు చేయిస్తున్న సర్పంచ్ గోవిందయ్య

వెదురుకుప్పం: మండలంలోని బొమ్మయ్య పల్లె పంచాయతీలోని జగనన్న కాలనీలో దుస్థితిలో ఉన్న అంతర్గత రోడ్ల మరమ్మతుకు చర్యలు తీసుకున్నట్లు స్థానిక సర్పంచ్ చొక్కా గోవిందయ్య తెలిపారు. ఇటీవల కురిసిన వర్షాలకు రోడ్లు అధ్వానంగా మారాయని స్థానికుల నుంచి ఫిర్యాదు రావడంతో వెంటనే స్పందించి జేసీబీ ద్వారా చదును చేయించినట్లు చెప్పారు. గ్రావెల్ తోలి పంచాయతీ నిధులతో పనులు చేపట్టినట్లు ఆయన తెలిపారు.

డ్రంక్ అండ్ డ్రైవ్ కేసుల్లో ఏడుగురికి జరిమానా

నగరి : బహిరంగంగా మద్యం సేవించడం, మద్యం సేవించి వాహనాలు నడిపిన కేసుల్లో ఏడుగురికి శనివారం ఇన్‌చార్జి సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ గోపాలకృష్ణ జరిమానా విధించినట్లు సీఐ మహేశ్వర్ తెలిపారు. బహిరంగంగా మద్యం సేవించిన కేసులో నలుగురిని అరెస్టు చేశామని, వారికి ఒక్కొక్కరికి రూ.వెయ్యి చొప్పున జరిమానా విధించినట్లు తెలిపారు. అలాగే మద్యం సేవించి వాహనం నడిపిన కేసులో ముగ్గురిని అరెస్టు చేయగా వారికి ఒక్కొక్కరికి రూ.10 వేలు చొప్పున జరిమానా విధించినట్లు పేర్కొన్నారు.

దూడల పెంపకంపై అవగాహన



జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి ప్రభాకర్‌ను సన్మానిస్తున్న పశు వైద్య సిబ్బంది

పెనుమూరు(కార్వేటినగరం) : నేటి లేగ దూడే రేపటి పాడి ఆవు అని జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి డాక్టర్ ప్రభాకర్ అన్నారు. శనివారం మండల పరిధిలోని శింగవాండ్ల ఊరులో లేగ దూడల పెంపకంపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి మాట్లాడుతూ.. లేగ దూడలపై ప్రత్యేక దృష్టి సారించాలని, పుట్టిన దూడకు తప్పనిసరిగా ముర్రు పాలను అందించాలన్నారు. మండల స్థాయిలో విధులు నిర్వహించే పశు వైద్యాధికారులు క్షేత్ర స్థాయిలో పర్యటించి పశుపోషణపై పాడి రైతులకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. మేలు జాతి దూడలను ఎంపిక చేసి రైతులకు బహుమతులను అందించారు. అలాగే గ్రామ వీధుల్లో మేలు జాతి లేగ దూడలతో ర్యాలీ నిర్వహించారు. అనంతరం జిల్లా పశుసంవర్థక శాఖ అధికారి డాక్టర్ ప్రభాకర్‌ను సిబ్బంది ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో డీడీ డాక్టర్ వాసు, ఏడీ డాక్టర్ గీతారెడ్డి, డాక్టర్ సుబ్రమణ్యం, డాక్టర్ ఆదిత్యనాథ్, పలువురు పశు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

మౌలిక వసతుల కల్పన కూడా నేరమా ?



ఎంపీడీఓ చంద్రమౌళి

కార్వేటినగరం: ప్రభుత్వ కార్యాలయాన్ని అభివృద్ధి చేయడం నేరమా అని కార్వేటినగరం ఎంపీడీఓ చంద్రమౌళి అన్నారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఎంపీడీఓ కార్యాలయంలో కనీస సదుపాయాల కల్పనకు సంబంధించి గత నెల జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో తీర్మానం చేయడం జరిగిందన్నారు. ఇందులో భాగంగా మరుగుదొడ్ల మరమ్మతులు, భవనానికి పెయింటింగ్ వంటి పనులు చేపడుతున్నట్లు ఎంపీడీఓ తెలిపారు. తమ కార్యాలయానికి 22 పంచాయతీల నుంచి వివిధ పనులపై ప్రజలు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, అత్యధికంగా మహిళలు వస్తుంటారన్నారు. వారి సౌకర్యార్థం మరమ్మతులు చేపట్టడం జరుగుతోందన్నారు. అయితే అధికారులు ప్రజాధనం వృథా చేస్తున్నారని కొందరు ఆరోపణలు చేయడం సమంజసం కాదన్నారు. ప్రజాధనం ఎక్కడ వృథా అయిందో నిరూపించాలన్నారు. ప్రజల కోసం మరుగుదొడ్లు నిర్మాణం చేయడం, మరమ్మతులు చేయించడం కూడా నేరమా ? అని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయాన్ని స్థానిక ఎమ్మెల్యే, జిల్లా కలెక్టర్ దృష్టికి కూడా తీసుకెళ్తానని తెలిపారు.

కుతూహలమ్మ సేవలు మరువలేనివి



కుతూహలమ్మ సమాధి వద్ద నివాళులర్పిస్తున్న ఆనగంటి హరికృష్ణ, నేతలు

గంగాధర నెల్లూరు: మాజీ డిప్యూటీ స్పీకర్, మాజీమంత్రి కుతూహలమ్మ సేవలు మరువలేనివని ఆమె కుమారుడు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆనగంటి హరికృష్ణ అన్నారు. శనివారం డాక్టర్ కుతూహలమ్మ రెండో వర్ధంతి సందర్భంగా మండలంలోని వింజం లక్ష్మీరెడ్డి పల్లి గ్రామంలో ఆమె సమాధి వద్ద నివాళులర్పించి, ఆమె చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో స్థానిక నేతలు మాజీ సర్పంచ్ గోవిందయ్య, మాజీ డీసీసీబీ డైరెక్టర్ నాగరాజు రెడ్డి, భీమ శంకర్ రెడ్డి, లోకేష్ రెడ్డి, విజయబాబు, కుట్టి, నాగేష్, యువరాజు తదితరులు పాల్గొన్నారు.

ముమ్మరంగా పారిశుధ్య పనులు



పచ్చికాపల్లంలో పేడదిబ్బలను తొలగిస్తున్న అధికారులు

వెదురుకుప్పం: మండలంలోని పచ్చికాపల్లంలో శనివారం పారిశుద్ధ్యం మెరుగుకు అధికారులు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. ఈసందర్భంగా ఎస్‌డబ్ల్యూపీసీ వద్ద శుభ్రం చేశారు. మట్టిని తోలి చదును చేశారు. అదేవిధంగా తిరుపతి ప్రధాన రహదారి, చిత్తూరు ప్రధాన రహదారికి ఇరువైపులా ఉన్న చెత్తాచెదారాన్ని జేసీబీతో తొలగించారు. అంతర్గత రోడ్లకు ఇరువైపులా పేరుకుపోయిన మురుగు నీరు, దిబ్బలు, పిచ్చిమొక్కలను తొలగించి పరిసరాలను శుభ్రం చేసినట్లు ఈఓపీఆర్డీ పురుషోత్తం తెలిపారు. ఇందులో భాగంగా మండలంలోని అన్ని పంచాయతీల్లో పారిశుద్ధ్యం మెరుగుకు ప్రత్యేక చర్యలు తీసుకున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సుకుమార్, సర్పంచ్ కవిత, గ్రామకార్యదర్శి మధు, సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా స్వచ్ఛాంధ్ర- స్వచ్ఛ దివస్



పుత్తూరు : చెర్లోపల్లి వద్ద పారిశుద్ధ్య పనులు చేస్తున్న పోలీసులు



పుత్తూరు : పాలిటెక్నిక్ కళాశాలలో మొక్కలు నాటుతున్న మున్సిపల్ కమిషనర్



పుత్తూరు : మహిళలతో ప్రతిజ్ఞ చేయిస్తున్న పుత్తూరు మున్సిపల్ కమిషనర్ మంజునాథ్‌గౌడ్

పుత్తూరు: మండలంలోని చెర్లోపల్లి వద్ద శనివారం స్థానిక పోలీసులు, మున్సిపల్ అధికారులు, ప్రభుత్వ కళాశాలల అధ్యాపకులు స్వచ్ఛాంధ్ర- స్వచ్ఛ దివస్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. సీఐ కేబీ సురేంద్రనాయుడు ఆధ్వర్యంలో ఎస్ఐ ఓబయ్య, సిబ్బంది పరిసరాల్లోని చెత్తా చెదారం తొలగించారు. మున్సిపల్ కమిషనర్ మంజునాథ్‌గౌడ్ స్థానిక ఎస్ఆర్ఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల, పిళ్లారిపట్టు ప్రభుత్వ పాలిటెక్నికల్ కళాశాల, అమరంకండ్రిగ, రాచపాళెం, రెడ్డిగుంట ప్రభుత్వ హైస్కూల్స్‌లో పారిశుద్ధ్యంపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ తడి, పొడి చెత్తను వేరు చేసి పారిశుద్ధ్య కార్మికులకు అందజేయాలని కోరారు. ప్లాస్టిక్ వినియోగం నిర్మూలనకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. ఈ సందర్భంగా స్వచ్ఛాంధ్ర ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో కళాశాలల ప్రిన్సిపాళ్లు చంద్రమౌళి, ఎస్వీకుమార్, మున్సిపల్ ఏఈ కార్తికేయ, శానిటరీ ఇన్‌స్పెక్టర్ మునస్వామి, పర్యావరణ కార్యదర్శులు, విద్యార్థులు పాల్గొన్నారు.

స్వచ్ఛ పంచాయతీగా తయారు కావాలి

నింద్ర: మండలంలోని ప్రతి గ్రామంలోనూ స్వచ్ఛ భారత్ కార్యక్రమాలు చేపట్టాలని జిల్లా పంచాయతీ అధికారి సుధాకర్ తెలిపారు. ఆయన శనివారం శ్రీరామాపురంలో జరుగుతున్న స్వచ్ఛ భారత్ కార్యక్రమాన్ని పరిశీలించారు. ఆయన మట్లాడుతూ ప్రతినెలా మూడో శనివారం స్వచ్ఛ భారత్ కార్యక్రమాలు చేపట్టాలన్నారు. ప్రతి గ్రామాన్నీ శుభ్రంగా వుంచుకోవాలని సూచించారు. అనంతరం ఆరూరు సర్పంచ్ కేశవులును సన్మానించారు. కార్యక్రమంలో సర్పంచ్ జయమ్మ, డివిజన్ పంచాయతీ అధికారి పార్వతి, ఎంపీడీవో శివప్రసాద్ వర్మ, ఈవోపీఆర్డీ లక్ష్మీపతి పాల్గొన్నారు.

పాలసముద్రంలో..

పాలసముద్రం: మన చుట్టూ ఉన్న పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాల్సిన బాధ్యత మనపై ఉందని ఎంపీడీఓ కృష్ణమహేష్ రెడ్డి, ఎంఈఓ రాజేంద్రప్రసాద్ తెలిపారు. శనివారం పాలసముద్రం ఉన్నత పాఠశాల, ప్రభుత్వ కార్యాలయ ఆవరణలో పరిసరాలను శుభ్రం చేశారు. శ్రీకావేరిరాజుపురం సర్పంచ్ గాలి మహేష్ బాబు సచివాలయ సిబ్బంది, ప్రాథమిక పాఠశాల విద్యార్థులతో కలసి పరిసరాలను శుభ్రం చేసి ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో హెచ్ఎం మీనాక్షి, శ్యామలమ్మ, మండల విస్తరణాధికారి రమేష్, ఉపాధిహామీ ఏపీఓ మార్గరేట్, హౌసింగ్ ఏఈ మధు, ఏఎస్ఐ రవి, విద్యార్థులు పాల్గొన్నారు.

ఐటీఐ కళాశాలలో స్వచ్ఛాంధ్ర

విజయపురం: మాధవరం ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో శనివారం స్వచ్ఛాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులు పరిసరాలను శుభ్రం చేసి మొక్కలు నాటారు. సమీపంలో ఉన్న గ్రామంలో ర్యాలీ నిర్వహించి తడి, పొడి చెత్త గురించి ప్రజలకు వివరించారు. చెత్తని వేరు చేసే విధానం పట్ల స్థానిక మహిళలకు అవగాహన కల్పించారు. అనంతరం విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ లలిత పాల్గొన్నారు.

సామాజిక భాగస్వామ్యంతో స్వచ్ఛాంధ్ర

నగరి : సామాజిక భాగస్వామ్యంతో స్వచ్ఛాంధ్ర కార్యక్రమం నిర్వహించి పర్యావరణాన్ని శుభ్రంగా మార్చుకుందామని మున్సిపల్ కమిషనర్ కృష్ణారెడ్డి తెలిపారు. నగరి మున్సిపల్ పరిధిలో స్వచ్ఛాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. ర్యాలీ నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రజలతో ప్రతిజ్ఞ చేయించారు. ప్రధాన కూడళ్లు, బస్టాండ్లతో పాటు పలు ప్రాంతాల్లో పారిశుద్ధ్య పనులు చేపట్టారు. కార్యక్రమంలో నగరి మున్సిపల్ మేనేజర్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్, టౌన్ ప్లానింగ్ అధికారి, శానిటరీ ఇన్‌స్పెక్టర్, ఏఈలు, వార్డు సచివాలయ సిబ్బంది, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు. అదేవిధంగా ఎంపీఐ వాసుదేవరెడ్డి ఆధ్వర్యంలో సిబ్బంది గుండ్రాజుకుప్పం, సుబ్బారెడ్డి లేఅవుట్ ప్రాంతాల్లో పారిశుద్ధ్య పనులు చేపట్టారు. ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించారు. మొక్కలు నాటారు. ప్రాథమిక వ్యవసాయ సహకార కేంద్ర సీఈవో తులసిపిళ్లై, డివిజనల్ కోఆపరేటివ్ అధికారి వనజ ఆదేశాల మేరకు పెట్రోల్ బంక్ ఆవరణలో పారిశుద్ధ్య పనులు నిర్వహించారు. కార్యక్రమంలో సిబ్బంది శేఖర్, గుణశేఖర్, కార్తిక్, తిరుమల పాల్గొన్నారు. స్థానిక డిగ్రీకళాశాలలో ప్రిన్సిపాల్ వేణుగోపాల్ స్వచ్ఛదివస్‌పై విద్యార్థులకు అవగాహన కల్పించారు.



సర్పంచ్‌ను సన్మానిస్తున్న జిల్లా పంచాయతీ అధికారి



పాలసముద్రం : అవగాహన ర్యాలీ చేస్తున్న అధికారులు



స్వచ్ఛత ప్రతిజ్ఞ చేయిస్తున్న నగరి మున్సిపల్ కమిషనర్

పౌష్టికాహారంతోనే ఆరోగ్యం



అంగన్‌వాడీ కేంద్రలో పిల్లల తల్లిదండ్రులకు సూచనలిస్తున్న అధికారులు

వడమాలపేట (విజయపురం) : వడమాలపేటలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో శనివారం ఈసీసీఈ (ఎర్లీ చైల్డ్ హుడ్ అండ్ కేర్ ఎడ్యుకేషన్) కార్యక్రమం నిర్వహించారు. సూపర్‌వైజర్లు రోజారమణి, మనీలా, ఎంఈవో పద్మావతి మాట్లాడుతూ గర్భవతులు, పిల్లలు పౌష్టిక విలువలు కలిగిన ఆహారం తీసుకోవాలన్నారు. అలాగే చిన్నతనం నుంచి పిల్లలను బడికి పంపించాలని సూచించారు.